క్లుప్తంగా

డ్రాపౌట్లపై సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



పోలకల్ గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓ - 2 ఆదామ్‌బాషా

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో బడి మధ్యలో మానేసిన (డ్రాపౌట్స్ పై) విద్యార్థులపై నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా చేట్టాలని ఎంఈఓ – 2 ఆదామ్‌బాషా ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని గ్రామాలలో గ్రామ సచివాలయాల సంక్షేమ సహాయకులు, గ్రామ వలంటీర్లు సర్వేను నిర్వహించారు. వారు పల్లెలోని వీధులు, కాలనీలలో తిరుగుతూ బడి మానేసిన విద్యార్థుల తల్లిదండ్రులకు బాల్య కార్మికులు చట్టాలపై అవగాహన కల్పించి ఆయా గ్రామాలలోని 12 మంది డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేరి్పంచారు. ఎంఈఓ – 2 సర్వేను పర్యవేక్షించారు.హెచ్‌ఎం తిమ్మన్న, సీఆర్‌పీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

భూముల రీ సర్వే పరిశీలన

గూడూరు రూరల్ : మండల పరిధిలోని మల్లాపురంలో రెవెన్యూ సిబ్బంది చేపట్టిన భూముల రీ సర్వేను సోమవారం తహసీల్దార్ శివశంకర్ నాయక్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని, సర్వే జరుగుతున్న సమయంలో తప్పక తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లతో హాజరుకావాలని కోరారు. రైతులు ఎంత వరకు సాగులో ఉన్నారో తెలుసుకునేందుకు డాక్యుమెంట్లు ఉపయోగపడతాయన్నారు. సర్వేకు రైతులందరు హాజరై భూమి కొలతలు కలిపించుకోవాలని ఆయన తెలిపారు.

పందుల నుంచి పంటలను కాపాడండి

సి.బెళగల్: పంటలను పందుల బెడదనుంచి కాపాడాలని మండల పరిధిలోని మారందొడ్డి గ్రామ రైతులు, సీపీఎం నాయకులు ఎంపీడీఓ రాముడును కోరారు. సోమవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోహన్ ఆధ్వర్యంలో మారందొడ్డి గ్రామ రైతులు స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని పందుల సమస్యలను ఎంపీడీఓకు విన్నవించుకున్నారు. తాము సాగు చేసిన పంట పొలాల్లో పందులు సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయని, పందుల యజమానులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు. పందులను గ్రామంను దూరంగా తరలించి మాకు న్యాయం చేయాలని కోరారు. పందుల యజమానులతో మాట్లాడి వాటిని తరలించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రైతులుకు హామీ ఇచ్చారు. ఆనంద్, గిరి, రసూల్, సుంకన్న, లక్ష్మన్న, శాంతిరాజు తదితరులు ఉన్నారు.

రైతులను మోసగిస్తే కఠిన చర్యలు



దుకాణంలో మందులను పరిశీలిస్తున్న ఏఓ

గడివేముల: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించి మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ హేమసుందర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. మందులను,రికార్డులను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గడువు ముగిసిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిరాం ఫార్మసీలో పర్యావరణ ఎక్స్‌పో



విద్యార్థులు తయారు చేసిన పర్యావరణ ఎక్స్‌పో ప్రాజెక్టు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఫార్మసీ కళాశాలలో సోమవారం పర్యావరణ ఎక్స్‌పో నిర్వహించారు. ప్రిన్సిపాల్ మధుసూదనశెట్టి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రపంచంలో నానాటికి పచ్చదనం తగ్గిపోతుందని, దీని వలన అనేక ప్రకృతి పమైన నష్టాలు వస్తున్నట్లు తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు

పాణ్యం : మండల పరిధిలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు ఈఓఆర్డీ భాస్కరరావు సోమవారం తెలిపారు. జనాభా ప్రాతిప్రదికన ఉన్నతాధికారులు ఆయా పంచాయతీలకు నిధులు కేటాయించారన్నారు. ప్రస్తుతం కేటాయించిన ఈ నిధులు పది రోజుల్లో పంచాయతీలకు జమ అవుతాయని చెప్పారు.





కోడుమూరు, గోరుకల్లులో కొలువుదీరిన పీర్లస్వాములు, సి.బెళగల్‌లో కొండలయ్య సరిగెత్తుకు ముస్తాబైన పాతకొండలయ్య పీర్లు

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

- గ్రామాలలో ప్రారంభమైన వేడుకలు
- చావిడీళ్లలో కొలువుదీరిన పీర్లు

సి.బెళగల్: మండలంలో కులమతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. గ్రామాలలో పీర్ల చావిడీల వద్ద ఐదు రోజుల ముందుగానే అలాయి గుంతలను (అగ్ని గుండాలను) తివ్విన నిర్వాహకులు, మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో వేడుకలు నిర్వహించనున్నారు. సి.బెళగల్‌లో శుక్రవారం రాత్రి ఒక్క పెద్ద ఇమాంఖాశీం చావిడిలోని పీర్లను మాత్రమే ప్రతిష్ఠించుకోగా, ఆదివారం రాత్రి సి.బెళగల్, గొల్లలదొడ్డి, ఇనగండ్ల, చింతమానుపల్లె, బురాన్‌దొడ్డి, పోలకల్, కంబదహాల్ తదితర గ్రామాలలో పూర్తి స్థాయిలో పీర్ల దేవుళ్లు కొలువుదీరి సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు.

కార్యక్రమాల వివరాలు

సి.బెళగల్‌లో మంగళవారం రాత్రి భక్తులు మొక్కులు చెల్లించి, బుధవారం తెల్లవారు జామున కొండలయ్య సరిగెత్తును, ఆదేరోజు రాత్రి చిన్న సరిగెత్తు నిర్వహిస్తారు. శనివారం వేకువజాము 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు పీర్లను ప్రత్యేక అలంకరణలతో గ్రామాలలో ఊరేగిస్తారు. అదేరోజు సాత్రం పీర్ల చావిడీల నుంచి పీర్లను ఊరేగింపుతో ఏటికి (ఊరి చివరకు) తీసుకెళ్తారు. అక్కడ పీర్లను విప్పి ముటకట్టి విషాద గీతాలను ఆలపిస్తూ చావిడీలకు చేరుకుంటారు. దీంతో మొహర్రం ఉత్సవాలు ముగుస్తాయి.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

మండలంలోని గ్రామలలో ఐదు రోజుల పాటు జరిగే మొహర్రం ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ పీరయ్య సూచించారు. ఇందు కోసం ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలను నిర్వహించామన్నారు. గ్రామాలలో పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశామని చెప్పారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



సి.బెళగల్‌లో సోమవారం తెల్లవారుజామున పీర్ల పెట్టల ఊరేగింపు దృశ్యం

కొలువుదీరిన పీర్లదేవుళ్లు

కోడుమూరు రూరల్ : మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాలు సోమవారం నుంచి మండలంలో ప్రారంభమయ్యాయి. మొహర్రం సందర్భంగా పట్టణంలోని కోటవీధి, చిన్నబోయవీధి, మోబిన్‌వీధుల్లో 9 చోట్ల పీర్లదేవుళ్లు కొలువుదీరారు. ఈనెల 26న చిన్న సరిగెత్తు, 28న పెద్ద సరిగెత్తు, 29వతేదీ శనివారం పీర్లదేవుళ్లు ఏటికి వెళ్లడంతో ఉత్సవాలు ముగుస్తాయని కోటవీధి పీర్లచావిడి నిర్వాహకులు నాయబ్ ఖాజామోద్దీన్ తెలిపారు. మండలంలోని వర్కూరు, పులకుర్తి, కల్లపరి, వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, అనుగొండ గ్రామాల్లో కూడా మొహర్రం సందర్భంగా ఆయా పీర్లచావిళ్లల్లో పీర్లదేవుళ్లు కొలువుదీరారు.

అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లు

కర్నూలు (న్యూటౌన్): మొహర్రం నెల ప్రారంభవ్వడంతో కర్నూలు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల అనుమతి తీసుకుని పీర్లను కూర్చొబెట్టారు. కర్నూలు మండలం ఎదురూరు గ్రామంలోని పీర్లచావిడిలో పెద్దయ్య, నడిపయ్య, చిన్నయ్య, మౌలాలి సాహెబ్, అల్లీపీర్ సాహెబ్‌ల పీర్లు కొలువుదీరాయి. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని మొక్కును తీర్చుకున్నారు.



ఎదురూరులో కొలువుదీరిన పీర్లు

కొలువుదీరిన గోరుకల్లు పెద్దస్వామి

పాణ్యం : గోరుకల్లు మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవాజామున పెద్దస్వామికి ప్రత్యేక ఫాతేహాలు చేసి మేళతాళాల మధ్య అలంకరించి కూర్చోబెట్టారు. నంద్యాల జిలాల్లోనే గోరుకల్లు మొహర్రం వేడుకలు ప్రసిద్ధి. స్వామి కొలుదీరడంతో దర్గాకు భక్తుల తాకిడి పెరింగింది.

ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చండి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలోని ఇందిరమ్మ, సుందరయ్యనగర్ సమీపంలో రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు వెంకటరాముడు, సీపీఎం మండల కార్యదర్శి ఉసేనయ్య కోరారు. సోమవారం ఎలక్ట్రికల్ డీఈ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్డుకు అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఆర్టీసీ బస్సు తిరగడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చితే బస్సు నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారన్నారు.

బెంచీల విరాళం

కర్నూలు (న్యూటౌన్): దివంగత కోడుమూరు మాజీ ఎమ్మెల్యే శిఖామణి 15వ వర్ధంతి సందర్భంగా ఆయన పెద్దకుమారుడు మణిబాబు కర్నూలు నగర శివారులోని 38వ వార్డు మునగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 60 బెంచీలను విరాళంగా అందజేశారు. సోమవారం 60 బెంచీలతో పాటు పాఠశాల ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును అందజేశారు. ఈ నెల 25వ తేదీన తన తండ్రి శిఖామణి 15వ వర్ధంతిని పురస్కరించుకుని మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 26న కార్యకర్తలు, అభిమానులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, సురేష్‌గౌడు, హరినాథ్, ఇలియాస్, పాలు రాజు తదితరులు పాల్గొన్నారు.

ముడుమలగుర్తిలో గడప గడపకు..

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే సుధాకర్ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుంటారన్నారు. అలాగే కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగనన్న



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు : రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఉలిందకొండ మజరా గ్రామాలైన ఎర్రకత్వ, కొల్లంపల్లితండా గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ వృద్ధులను, మహిళలను అప్యాయంగా పలకరిస్తూ విస్తృతంగా పర్యటించారు. సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98శాతం అమలు చేశామన్నారు. చెప్పిన వాటితో పాటు చెప్పనవి కూడా ప్రజలకు అందిస్తునమన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసేపోగు సుంకులమ్మ, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ అనురాధ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి, రమణ, శీనయ్య, శ్రీనివాసులు, జగదీష్, బాలు, దీపా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ పథకాల లబ్ధి

- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- ముడుమలగుర్తిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప గడపకు చేరుతుండడంతో ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. సోమవారం మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇళ్లు అవసరమై వారి వివరాలు తీసుకుని నివేదిక ప్రభుత్వానికి పంపాలంటూ ఎంపీడీఓ చంద్రశేఖర్, పీఆర్, హౌసింగ్ ఏఈలు గంగరాజు, లక్ష్మన్నలను ఎమ్మెల్యే ఆదేశించారు.



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

బాబు, పవన్ కల్యాణ్‌లకు ప్రజలే బుద్ధి చెప్పాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ సుపరిపాలన అందజేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. నవరత్నాలు, అమ్మ ఒడి, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, నేతన్న నేస్తం వంటి పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు, రైతులకు మేలు చేకూరిందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఏఓ రవిప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మధు, ప్రహ్లాదరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్, మల్లేష్, మద్దిలేటి, సుంకన్న, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 30వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం
- లబ్ధిదారులకు ధ్రువ పత్రాల పంపిణీ

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల చెంతకే పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 30వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రాని వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం తీసుకువచ్చామన్నారు. ఆయా వార్డులో జరుగుతున్న సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లబ్దిదారులకు వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. జల్లెడ పట్టి అందరికి సమక్షేమ పథకాలు ఫలాలు అందించేల చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.జయరాముడు, మున్సిపల్ అధికారులు గోపాల్ కృష్ణ, క్రిష్టఫర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, తిరుమలేష్ గౌడ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- ఉల్చాల, సుంకేసుల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం

కర్నూలు (న్యూటౌన్): సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులకు న్యాయం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు మండలం ఉల్చాల, సుంకేసుల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పాలనలో నమూల మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజా సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. అర్హులందరికీ జగనన్న సురక్ష కార్యక్రమంతో లబ్ది చేకూరుతుందని చెప్పారు. సుంకేసులలో 400, ఉల్చాలలో 407 మందికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అంజదేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, విజయలలిత 20వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ, డీటీ సహెరాబాను, ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి, చిన్న లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



ఉల్చాలలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

జగనన్న సురక్ష ప్రజలకు వరం



జగనన్న సురక్ష పేద ప్రజలకు వరంలాంటిది. గతంలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్ల చెప్పులరిగేలా తిరిగి తెచ్చుకున్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. కేవలం రెండు రోజుల్లోనే కుల ధ్రువీకరణ పత్రాన్ని జగనన్న సురక్ష కార్యక్రమంలో అందించడం ఎంతో సంతోషంగా ఉంది.

– ఎం సరోజమ్మ, ఉల్చాల గ్రామం

సేవలు అభినందనీయం



జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ సేవలు వేగంగా అందించడం అభినందనీయం. కేవలం మూడు రోజుల్లోనే కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఇంత వేగంగా ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే అందించడం ఎప్పుడూ ఊహించలేదు. జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు, ఇంటి వద్దకే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించడం చాలా బాగుంది.

– ఎస్ గౌసియాబీ, స్థానికురాలు

కుష్టు రహిత సమాజానికి కృషి చేయాలి

గడివేముల: కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుష్టు వ్యాధి నిర్మూలన విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన గడివేములలో జరుగుతున్న లెప్రసీ సర్వేను పరిశీలించారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండలంలో నమోదైన కేసులపై ఆరా తీశారు. జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వైద్య సిబ్బంది ప్రతి ఇంటి వద్దకు క్షేత్రస్థాయిలో వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి వైద్య సేవలు అందించాలని సూచించారు. డాక్టర్ తేజస్వినీ, ఎంపీహెచ్‌ఈఓ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కల్లూరు: 44వ జాతీయ రహదారిపై పెద్దటేకూరు సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. తడకనపల్లె గ్రామానికి చెందిన వడ్డె నాగన్న(67) ఆటోలో కర్నూలు నుంచి సొంత గ్రామానికి వస్తుండగా 44వ జాతీయ రహదారి పెద్దటేకూరు సమీపంలో వెనక వైపు నుంచి స్కూటీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వడ్డె నాగన్నకు, ద్విచక్ర వాహదారుడు రామారావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే పెట్రోలింగ్-1 వాహనంలో హెడ్ కానిస్టేబుల్ ఎం.నూర్ అహమ్మద్ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిచారు. ఘటనపై ఉలిందకొండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివనాగ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచు జయమ్మ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు హాజరుకానున్నారన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

511 లీటర్ల పాలతో అభిషేకం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సోమవారం 511లీటర్లతో పాలాభిషేకం చేశారు. ఈఓ రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన వేణుగోపాల్, రమాదేవి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి 511లీటర్ల పాలతో అభిషేకం చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ, కృష్ణయ్య, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

సి.బెళగల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు – నేడు రెండో విడతలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీరాజ్ ఈఈ మద్దమన్న హెచ్చరించారు. సోమవారం ఆయన కర్నూలు డివిజన్ పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు మహేశ్వరరెడ్డి, ఏడుకొండలుతో కలిసి మండలంలోని గ్రామాలాలలో పర్యటించి నాడు – నేడు పనులను పరిశీలించారు. మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలించిన వారు పర్యవేక్షణ, నిర్మాణ లోపాలపై సంబంధిత అధికారులపై మండిపడ్డారు. ప్రభుత్వ నిర్దేశ మార్గదర్శకాలను అనుసరించి పనులను చేపట్టాలని, నాణ్యత లోపాలు, నిర్లక్ష్య పనులను చేపట్టే వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసేనాయక్, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ నిఖిల్ తదితరులు ఉన్నారు.

గడువులోగా భవన నిర్మాణాలు పూర్తి చేయండి

మండలంలోని గ్రామాలలో నిర్మాణ దశలలో ఉన్న భవన నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ మద్దమన్న ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, కర్నూలు పీఆర్ డీఈ మహేశ్వరరెడ్డితో కలిసి మండలంలోని ప్రభుత్వ భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, సచివాలయ ఇంజినీర్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ సచివాలయాల నిర్మాణాలకు గతంలో ఉన్న రూ.40 లక్షలకు అదనంగా మరో రూ.3.60 లక్షలను పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా ఈఈ గ్రామాల వారిగా భవన నిర్మాణ పురోగతిపై చర్చించారు. మండలంలో 13 వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు కాగా, ఒక్కటి కూడ నిర్మాణం పూర్తి కాకపోవడంతో మండిపడ్డారు. కాంట్రాక్టర్లు చొరవచూపి నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలని మండల అధికారులను ఆదేశించారు. ప్ర వర్క్ ఇన్‌స్పెక్టర్ పాపా రాయుడు, ఇంజినీర్ అసిస్టెంట్ శ్రీరాములు తదితరులు ఉన్నారు.



ఇనగండ్ల జెడ్పీ హైస్కూల్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

నెలాఖరు వరకు పంటల సాగుకు అవకాశం

సి.బెళగల్: మండలంలో ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు ఈనెల ఆఖరు వరకు అవకాశం ఉందని, పంటలు విత్తుకోని రైతులు సాగు చేసుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లోని పొలాలను సందర్శించి రైతులు సాగు చేసిన పత్తి, కంది తదితర పంటలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. గత నాలుగు రోజులలో మండల వ్యాప్తంగా 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యిందని, ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇంతవరకు పంటలు సాగు చేయకుండా మిగిలిపోయిన దాదాపు 3,950 ఎకరాల్లో రైతులు ఈనెల చివరి వరకు విత్తుకోవచ్చన్నారు. ముఖ్యంగా ఆముదము, కొర్ర, కందులు, పత్తి, సజ్జలు, పెసర, అలసందలు వంటి పంటలు ఇంకానూ సాగు చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే సాగు చేసిన పంటలు ఏపుగా పెరిగేందుకు 19-19-19 లేదా 13-0-45లను 5 గ్రాములు ఒక్క లీటరు చొప్పున నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సూక్ష్మ పోషకాలైన జింక్, కాపర్, మాంగనీసు, కొరకు ఫార్ములా 4 లేదా 6ని 5 గ్రాములు ఒక్క లీటరుకు చొప్పున కలుపుకుని పంటలపై పిచికారీ చేసుకున్నట్లెయితే పంటలు ఆరోగ్యకరంగా పెరుగుతాయని ఏఓ తెలిపారు.



సి.బెళగల్‌లో పైరును పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్